వెలగని సోలార్ లైట్లు

- నిరుపయోగంగా మారిన వైనం
- రూ.లక్షలు వెచ్చించి వదిలేశారంటున్న గ్రామీణ వాసులు
- కరెంట్ ఉన్నా గ్రామాలు అంధకారం





సాతర్లలో నిరుపయోగంగా ఉన్న సోలార్‌లైట్, రాజోళిలో నిరుపయోగంగా ఉన్న సోలార్‌లైట్

శాంతినగర్: గ్రామీణ ప్రాంత ప్రజలు చీకట్లో ఇబ్బందులకు గురికాకుండా ఉండాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామాల్లో ఏర్పాటుచేసిన సోలార్ వీధి లైట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో రాత్రి వేళల్లో కరెంట్ ఉన్నా లేకపోయినా గ్రామాలు అంధకారంలో మగ్గాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో 8ఏళ్ల క్రితం వాటర్‌షెడ్ (జల జీవని) పథకం కింద ఒక్కో గ్రామంలో పది నుంచి 25 వరకు సోలార్ వీధి లైట్లు ఏర్పాటుచేశారు. ఒక్కో వీధి లైటుకు రూ.16,500 ఖర్చు చేశారు. ఏడాది వరకు బాగా వెలిగినా, ఆ తర్వాత వెలగకుండా పోయాయి. వాటికి మరమ్మతులు చేయిద్దామని సర్పంచ్‌లు ముందుకురాగా కంపెనీవారు బ్యాటరీ బాక్స్‌లకు తాళాలు వేసుకుని వెళ్లడంతో వారు పట్టించుకోలేదు. సంబంధిత కంపెనీ వారికి సర్పంచ్‌లు మొరపెట్టుకున్నా ఇదిగో వస్తాము అదిగో వస్తామని కాలయాపన చేస్తూ వాటి మరమ్మతు చేయడానికి రాలేదు. దీంతో పథకం లక్ష్యం నెరవేరకపోగా రూ.లక్షల్లో ప్రభుత్వ సొమ్ము వృథాగా మారింది. అంతేగాక వాటర్‌షెడ్ పథకం నిర్వహణను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అంతేగాక రాజోళి మండలంలోని కొత్త రాజోళిలో వరద బాధిత గృహాల్లో స్వచ్ఛంద సంస్థలు విరాళంగా ఇచ్చి ఏర్పాటు చేసిన వెయ్యికి పైగా సోలార్ లైట్లు వృథాగా మారాయి. నాలుగేళ్ల క్రితం గ్రామానికి చెందిన జిల్లా కోఆప్షన్ సభ్యుడు సోలార్ కంపెనీ వారితో మొరపెట్టుకోగా వాటిలో 200 వరకు లైట్లకు మరమ్మతు చేసి వదిలేశారు. ప్రస్తుతం అవి కూడా వెలగడం లేదు. దీంతో కరెంట్ పోయిన సమయంలో కొత్త రాజోళి అంధాకారంలో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిష్టిబొమ్మల్లా దర్శనం

గ్రామాల్లో గతంలో వెలుగులు జిమ్మిన వీధిలైట్లు ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మండలంలో నాలుగైదు గ్రామాలకు సోలార్ లైట్లు ఇవ్వడంతో మిగతా గ్రామాల ప్రజలు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తే బాగుండే అనే పరిస్థితి ఉండేది.

మరమ్మతు చేయించాలి



సోలార్ లైట్లు అమర్చే సమయంలో మా కాలనీలో పోటీపడి వేయించాం. 8నెలలపాటు మంచిగా పనిచేసింది. తర్వాత వెలగడం లేదు. ముఖ్యంగా గాలుల కాలంలో రాత్రి వేళల్లో తరచూ కరెంట్ పోతుంది. ఆ సమయంలో వేరే గ్రామాలు అంధకారంలో ఉన్నా మా గ్రామంలో సోలార్‌లైట్ల వల్ల వెలుగులు ఉండేవి. ఏడేళ్లుగా పనిచేయడం లేదు. మరమ్మతు చేయించి ప్రజలకు సౌకర్యం కల్పించాలి.

– మద్దిలేటి, సాతర్ల, ఇటిక్యాల మండలం

దాతల సాయం వృథా..



మా గ్రామం 2009 వరదల్లో ముంపునకు గురైంది. అప్పట్లో స్వచ్ఛంద సంస్థ వారు కొత్త రాజోళిలో వెయ్యికి పైగా సోలార్‌లైట్లు ఏర్పాటు చేశారు. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. నాలుగేళ్ల క్రితం సోలార్ కంపెనీ వారితో మాట్లాడి 200 లైట్లకు మరమ్మతు చేయించాను. ఏడాది పాటు మాత్రమే వెలిగాయి. ప్రస్తుతం వాటి నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత కంపెనీవారు మరమ్మతు చేయించి దాతల సొమ్ము వృథా కాకుండా చూడాలి.

– నిసాఖ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, రాజోళి

బాలల సంరక్షణపై అవగాహన



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ అధికారి శివ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వేములలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో బాలల చట్టాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలకు ఎదురయ్యే వివిధ సమస్యలు, బడి బయటి పిల్లలు, బాల్య వివాహాల వల్లే కలిగే అనార్థాలు, బాల కార్మిక వ్యవస్థతో పాటు బాలల యొక్క చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలు ఎలాంటి వేధింపులకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ కమిటీ సభ్యులతో పాటు ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు ఏ సమయంలోనైనా టోల్‌ఫ్రీ నంబర్ 1098కి ఫోన్ చేసి సాయం పొందవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అనాథ పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యురాలు సరాగిని, ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు తిమ్మయ్య, చంద్రన్న, లక్ష్మీనర్సింహ, పార్వతి, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు గర్వించే స్థాయికి చేరుకోవాలి



ప్రభుత్వ కళాశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



కస్తూర్బాలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గట్టు: విద్యార్థి జీవితంలో ఇంటర్ చాలా కీలకమని, విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు గర్వించే స్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవంతో పాటుగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి కలలను కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు ఇప్పటి నుంచే శ్రమించాలన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణను సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, రాజగోపాల్, శ్యాంసుందర్, రంగస్వామి, మహేష్, భరత్, విష్ణు, ఆంజనేయులు, శేఖర్, శ్రీజ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గోపిలత, ఉపాధ్యాయుడు రాజుసాగర్ పాల్గొన్నారు.

నేడు కంచుపాడులో రథోత్సవం



కంచుపాడులో ముస్తాబైన ఆలయం, రథం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో పౌర్ణమి సందర్భంగా రేణుక ఎల్లమ్మ (జములమ్మ)కు ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవంలో ఊరేగిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకోవాలని ఆలయ కమిటీ పేర్కొంది. పేర్కొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు

మానవపాడు: మండలంలోని 16 పంచాయతీల్లో నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొలకెత్తే విత్తనాలు వంద శాతం వచ్చే విధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ లాలూనాయక్, రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పేరు పాఠశాల తనిఖీ

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలను శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల యాక్షన్ ప్లాన్, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు విద్యార్థులకు సరిపడా ఉన్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం నారాయణరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



జిల్లా కేంద్రంలో సత్యసాయి విద్యామందిర్‌లో..



తాటికుంటలో..

గద్వాల: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక సత్యసాయి విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు చక్కటి బోధన చేశారు. కలెక్టర్‌గా పవన్, డీఈఓగా చైతన్య, ఎంఈఓగా గురునాథ్‌జీ, కరస్పాండెంట్‌గా చరణ్ తేజ్, హెచ్‌ఎంగా అక్షితలు వ్యవహరించారు.

శాంతినగర్: విద్యార్థులే అధికారులు, ఉపాధ్యాయులుగా మారి వారి విధులు నిర్వర్తించి పలువురిచే మన్ననలు పొందారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీఈఓ శృతి, ఎంఈఓగా మహేష్, హెచ్‌ఎం ఖాజాబీ, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన విద్యార్థులను పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం నరసింహ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరుణ్‌రషీద్, జీవన్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, సురేఖ, మధు, రామాంజనేయులు, శ్రీను, ధనలక్ష్మి, హరిప్రసాద్, వసంత, సాయిబాబ, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

మల్దకల్ : మండలంలోని తాటికుంట హైస్కూలులో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా జునైద్ భాషా, ఎంఈఓగా ఊహ, హెచ్‌ఎంగా జ్యోతి, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 39 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించినట్లు హెచ్‌ఎం హేమలత తెలిపారు. డీఈఓగా కుమారి, హెచ్‌ఎంగా నేహారెడ్డి వ్యవహరించారు.



రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



ఉండవెల్లిలో ..

క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ వితరణ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని చదివిన 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.19 వేల విలువ గల ప్రింటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, ప్రసన్న, వెంకటస్వామి, చిన్న గోరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫుట్‌బాల్స్ అందజేత

గద్వాల: ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నర్సింహ, భాస్కర్‌యాదవ్ ఫుట్‌బాల్స్‌ను హెచ్‌ఎం ఇమ్మాయేనల్‌కు అందజేశారు. పాఠశాల క్రీడాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు సూచించారు. కార్యక్రమంలో పీఈటీ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మొక్కలు పెంచండి



అయిజ: నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచాలని ఎంపీడీఓ వెంకటయ్య నర్సరీ నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, పులికల్, రాజాపురం, బైనిపల్లిలో ఈజీఎస్ సిబ్బందితో కలిసి మొక్కలను పరిశీలించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి పెంచాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, మొక్కలపై షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఈజీఎస్ పనులను పరిశీలించారు.

ఉత్సవాలకు ఆహ్వానం

అయిజ: పట్టణంలో నిర్వహించనున్న తిక్క వీరేశ్వరస్వామి ఉత్సవాలకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజులను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈనెల 27 నుంచి మార్చి 11 వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు సహాయ సహకారాలందించాలని కోరారు. మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులను కలిసి ఆయా శాఖలపరంగా ఉత్సవాలకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు ఉమామహేష్, అశోక్, కమిటీ సభ్యులు మహానందిరెడ్డి, గోవిందు, రాముడు, పరశ, కృష్ణ, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌దారులే విత్తనాలను విక్రయించాలి

మల్దకల్: లైసెన్సు ఉన్న ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు మాత్రమే రైతులకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. స్టాక్ వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. అనుమతులు లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

దాడి ఘటనలో ముగ్గురి రిమాండ్

ఎర్రవల్లిచౌరస్తా: ఓ యువకుడిపై అకారణంగా దాడి చేసిన ఘటనలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కర్నూల్ పట్టణానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్, దిలీప్‌కుమార్, అశోక్ గురువారం సాయంత్రం ఎర్రవల్లికి వచ్చి మద్యం మత్తులో ఎర్రవల్లికి చెందిన అశోక్ బైక్‌కు తమ బైక్‌తో అడ్డంగా వచ్చి అకారణంగా కొట్టారు. ఈ ఘటనలో అతనికి కుడి చెవి దగ్గర తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసి వారి బైక్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చెన్నకేశవస్వామి కల్యాణం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణాన్ని రైతు సంఘం సభ్యులు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాండురంగారావు, శివారెడ్డి, శ్రీరాములు, భీముడు, కొండన్న అర్చకులు పాల్గొన్నారు.



చదువుకుంటేనే మంచి భవిష్యత్



బల్గెరలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య

గట్టు: పాఠశాలకు వెళ్లి చదువుకుంటే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ చెన్నయ్య విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. శుక్రవారం మాచర్ల ఉన్నత పాఠశాల పరిధిలోని బల్గెర, మాచర్ల పదో తరగతి చదువుతూ మధ్యలో మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులను ఎంపీడీఓ, మాచర్ల కార్యదర్శి ప్రదీప్ కలిశారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారని, విద్యార్థులను క్రమం తప్పక పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. బడి మానేసిన విద్యార్థినితో పాటుగా తల్లిదండ్రులతో ఎంపీడీఓ మాట్లాడి బడికి హాజరయ్యే విధంగా ఒప్పించారు.

రైల్వే పరిసర ప్రాంతాల్లో తనిఖీ



గద్వాల రైల్వే సరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్న పట్టణ పోలీసులు

గద్వాల క్రైం: అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన గద్వాల రైల్వే పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌కు సమీపంలో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ స్థలం, పురాతన క్వార్టర్స్‌లలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఏర్పాటు చేసుకున్నారని, ఇటీవల స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో తెల్లవారు జాము నుంచి తనిఖీ చేపట్టామన్నారు. మద్యం సీసాలు, పేక ముక్కలు పడి ఉన్నాయన్నారు. కనీసం రైల్వే ప్రయాణికులకు భద్రత చర్యలు చేపట్టాల్సిన రైల్వే పోలీసు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ వ్యవహారం జరుగుతుందన్నారు. ఇలాంటి వాటిపై ప్రత్యేక చర్యలు చేపట్టి పెట్రోలింగ్, గస్తీ ఏర్పాట్లు చేస్తామన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. సంబంధిత శాఖ సిబ్బందితో మాట్లాడి పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేపట్టేందుకు శ్రీకారం చుడతామని ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దేవాలయాల్లో పూజలు



శాంతినగర్‌లో రేణుక ఎల్లమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ సమీపంలో వెలసిన రేణుక ఎల్లమ్మ కొత్త ఉత్సవ విగ్రహాన్ని శుక్రవారం శాంతినగర్‌లో ఊరేగించారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణం వరకు ఊరేగించి గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

రాజోళి: మండలంలో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. ప్రత్యేకించి పచ్చర్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. స్థానికంగా కొలువైన రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ఉదయం పొంగులొట్టితో బిందె సేవ చేశారు. ఆడపడుచులు పసుపు కుంకుమలు, చీరలు, గాజులు సమర్పించారు. తమ సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించుకున్నారు. బోనమెత్తుకుని, డప్పుల చప్పుడుతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అర్చకులు స్వామివారికి అభిషేకం చేశారు. సాయంత్రం వేదపండితులు హోమం నిర్వహించారు. రాత్రి స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి.

వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

కేశవరంలో నిర్వహిస్తున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తుంగభద్రనదికి గంగ పూజచేసి, ఆ నీటితో స్వామివారిని అభిషేకం నిర్వహించారు. పల్లకీసేవ చేపట్టారు. రాత్రి ప్రభ వాహనంపై ఊరేగించారు.



పచ్చర్లలో బోనమెత్తుకుని వెళ్తున్న భక్తులు

కనులపండువగా కల్యాణం

మండలంలోని రాజాపురంలో గుంటి రంగనాథ స్వామి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కల్యాణం వేదపండితులు కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఉత్సవ విగ్రహాలకు తుంగభద్రి నది జలాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సరస్వతి దేవికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.



అయిజలో వేంకటేశ్వరస్వామి మూల విరాట్



రాజాపురంలో పూజలు

వాహనదారులకు ఉపశమనం

- రోడ్డుపై నీళ్లు చల్లుతున్న పంచాయతీ సిబ్బంది



ధరూరులో ట్యాంకర్ ద్వారా నీళ్లు చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

ధరూరు: గద్వాల – రాయచూరు రహదారిలో వాహన రాకపోకలు పెరుగుతున్నాయి. రాయచూరు వద్ద కృష్ణా బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఆ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. పనులు కొనసాగుతుండడంతో అటుగా హైదరాబాద్, కర్ణాటక వెళ్లే వాహనాలను గద్వాల మీదుగా రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో వాహన రద్దీ గత నెల రోజులుగా తీవ్రంగా ఉంది. దీంతో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నుంచి ఎరుకలి వీధి వరకు వాహన రాకపోకల సమయంలో దుమ్ము ఎగసి పడుతుండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో గత నెల 22న 'సాక్షి' దినపత్రికలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'రాయచూరు రోడ్డులో పెరిగిన రద్దీ' కథనాన్ని ప్రచురితం చేసింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంకర్ ద్వారా నీళ్లు చల్లిస్తే దుమ్ము సమస్య కొంతైనా తగ్గుతుందని వివరిస్తూ వార్తా కథనాన్ని ప్రచురితం చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకాధికారుల పాలనలో అధికారులు ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లిస్తున్నారు.